క్లుప్తంగా

మానసిక ఆరోగ్యమూ కీలకమే



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వంశీ కృష్ణ

ఏలూరు (టూటౌన్): శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా సంపూర్ణ ఆరోగ్యానికి అత్యంత కీలకమని హెచ్‌వోడీ డాక్టర్ సీహెచ్ వంశీ కృష్ణ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శనివారం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో సైకియాట్రీ డిపార్టుమ్మెంట్‌లో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం వారు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ వంశీ కృష్ణ మాట్లాడారు. నేటి వేగవంతమైన జీవితంలో ఒత్తిడి, ఆందోళనలు, ఇతర మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. విపత్తుల సమయాల్లో ప్రజలు మానసికంగా కుంగిపోకుండా, వారికి సరైన మద్దతు, సలహా, చికిత్స లభించడం చాలా ముఖ్యమన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు సర్వజన ఆసుపత్రి సిబ్బంది, డీడీఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేకుంటే కేసులు



అశోక్‌నగర్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై శ్రీధర్

ఏలూరు టౌన్: మోటారు వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుంటే కేసులు నమోదు చేస్తామని ఏలూరు ట్రాఫిక్ ఎస్సై శ్రీధర్ హెచ్చరించారు. ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణబాబు ఆధ్వర్యంలో ఏలూరు అశోక్‌నగర్, పత్తేబాద, తదితర ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనానికి రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ పత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్సు కూడా విధిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించటం ద్వారా ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాపాయ స్థితి నుంచి రక్షణ లభిస్తుందన్నారు. తనిఖీల్లో ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

పైడి చింతపాడులో తనిఖీలు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పైడి చింతపాడు గ్రామంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేశారు. సంఘ వ్యతిరేక కార్యకలపాలపై సమాచారం తెలియజేయాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, ఏఈఎస్ పాండురంగారావు కోరారు. గ్రామ సర్పంచ్ ముంగర తిమోతిని కలిసి గ్రామంలో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎస్సైలు గౌరీ శంకర్ సుధీర్ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికోలకు వసతి కష్టాలు

- హాస్టల్ భవన నిర్మాణాలపై నిర్లక్ష్యం
- ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- కొరవడిన ఏపీఎంఎస్ఐడీసీ అధికారుల పర్యవేక్షణ



ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో నిర్మిస్తున్న హాస్టల్ భవనాలు



ఎంసీహెచ్ బ్లాక్ పై అంతస్తులో ఎంబీబీఎస్ కొత్త విద్యార్థులకు వసతి

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు వసతి కష్టాలు తప్పటంలేదు. మూడో ఏడాది విజయవంతంగా ఎంబీబీఎస్ అడ్మిషన్లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో వైద్య విద్యార్థులకు మెరుగైన రీతిలో వసతి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ఏపీ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) అధికారులు నిర్లిప్తత, పర్యవేక్షణ పక్కాగా లేకపోవటంతో వైద్య విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించలేని దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు కావస్తున్నా, హాస్టల్ భవనాలు పూర్తి చేయటంలో విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి. తక్షణమే భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

సీట్లు ఫుల్.. సౌకర్యాలు నిల్

ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభించి మూడో ఏడాది ఎంబీబీఎస్ సీట్లు ఫుల్ అయ్యాయి. సెప్టెంబర్ నెలాఖరు నాటికే నీట్ కౌన్సిలింగ్ రెండో దశ పూర్తి కావటంతో ఏలూరు వైద్య కళాశాలలో 150 ఎంబీబీఎస్ సీట్లకు 140 వరకు భర్తీ అయ్యాయి. మిగిలిన 10 సీట్లు ఈ నెలాఖరులోపు భర్తీ అవుతాయని మెడికల్ కాలేజీ అధికారులు చెబుతున్నారు. ఇక ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ పట్ల రాష్ట్రంలోని ఇతర జిల్లాల వైద్య విద్యార్థులు ఆసక్తి చూపిస్తుండడంతో సీట్లు త్వరగా భర్తీ అయ్యాయి. సీట్లు ఫుల్ అవుతున్నా, సౌకర్యాలు కల్పించటంలో అధికారులు విఫలమయ్యారు. ఏలూరు జీజీహెచ్‌లో అత్యాధునిక సౌకర్యాలతో బాలురు, బాలికలకు వేర్వేరుగా రెండు భారీ భవన నిర్మాణాలను గత వైఎస్సార్‌సీపీ హయాంలోనే ప్రారంభించారు. 50 శాతం పనులు ఎన్నికల ఫలితాల నాటికే పూర్తి కాగా, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు కావస్తున్నా భవన నిర్మాణాలు పూర్తి కాలేదనే విమర్శలు వస్తున్నాయి.

నేటికీ పూర్తికాని నిర్మాణాలు

ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో సుమారు రూ.30 కోట్ల వ్యయంతో రెండు హాస్టల్ భవనాల నిర్మాణం 2023వ సంవత్సరంలోనే ప్రారంభించారు. వేగంగా పనులు చేపట్టారు. ఒక్కో భవనం సుమారు 35 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ 6, జీ ప్లస్ 5 భవనాలను నిర్మిస్తున్నారు. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో మెఘా కంపెనీ నిర్మాణ బాధ్యతలు తీసుకుంది. కానీ నేటికీ పూర్తిస్థాయిలో నిర్మాణాలు పూర్తికాలేదు. ఒక భవనంలో కొన్ని గదులను పూర్తి చేసి, వాటిలో ఎంబీబీఎస్ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు వసతి కల్పించారని చెబుతున్నారు. చుట్టూ చెట్లు, పొదలు, పూర్తి కాని భవనాల్లో వైద్య విద్యార్థులకు వసతి ఏ విధంగా కల్పిస్తారనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇక ఎంసీహెచ్ బ్లాక్ పై అంతస్తులో కొత్తగా ఎంబీబీఎస్ మొదటి ఏడాది చేరిన వైద్య విద్యార్థులకు వసతి కల్పించినట్టు అధికారులు చెబుతున్నారు. ఇంకా ఎంతకాలం తాత్కాలిక వసతులే అంటూ ఏలూరు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. యుద్ధ ప్రాతిపదికన ఏడాదిన్నరలోనే ఏలూరు పాత బస్టాండ్ సమీపంలో డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద రూ.60 కోట్లతో భవనాన్ని అత్యాధునిక సౌకర్యాలు, ల్యాబ్‌లతో నిర్మించారు. ఏలూరు జీజీహెచ్‌లో శాశ్వత భవనాన్ని రూ.80 కోట్లతో అప్పట్లోనే నిర్మాణం ప్రారంభించారు. వైద్య విద్యార్థులకు మూడో ఏడాది కూడా పూర్తిస్థాయిలో వసతి సౌకర్యాలు కల్పించకపోవటం దారుణం. అధికారులు ఇప్పటికైనా చిత్తశుద్ధితో భవన నిర్మాణాలు పూర్తిచేసి మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.

– ప్రత్తిపాటి తంబి, ఏలూరు లీగల్ సెల్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

ప్రైవేటీకరణకు నిరసనగా 14న ధర్నా



సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): స్థానిక 11, 30వ డివిజన్లలో పారిశుద్ధ్య పనుల ప్రైవేటీకరణకు నిరసనగా ఈనెల 14వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఏలూరు నగర కమిటీ సమావేశం తీర్మానించింది. పాండురంగ థియేటర్ వద్ద గల కార్మిక సంఘాల కార్యాలయంలో ఫెడరేషన్ ఏలూరు నగర కమిటీ సమావేశం యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడారు. పారిశుద్ధ్య పనుల ప్రైవేటీకరణ వల్ల దళారీ వ్యవస్థ ఏర్పడుతుందని, కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు కావని ఆందోళన వ్యక్తం చేశారు. ఖాళీ పోస్టులను ఆప్కాస్ విధానంలోనే భర్తీ చేయాలని, ఆప్కాస్ విధానం కొనసాగించాలని కోరారు. నాయకులు పట్నాల నూకరాజు, బంగారు వెంకటేశ్వరరావు, కారు దుర్గారావు, చవిటి అనిల్, ఆంతోనీపాల్, పంతం చిన్న నాగరాజు, తానంకి జార్జి, బాలు, కాళిదాసు, రేణుకేశ్వరరావు, ఎం జార్జి, రాజు, నక్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చౌక్ వద్ద ఉపాధ్యాయుల నిరసన



ధర్నా చౌక్‌లో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శనివారం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన ఎంటీఎస్ ఉపాధ్యాయుల విజ్ఞాపన సభకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరయ్యారని ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర నాయకుడు తోట ఎడ్వర్డ్ ఏలూరులో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4 వేల మంది హాజరైనట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 1998 డీఎస్సీ అర్హులైన ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, 25 సంవత్సరాలు నష్టపోయిన సర్వీసును భర్తీ చేయాలని, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పొడిగించాలని డిమాండ్ చేశామని తెలిపారు. ఏడాదిలో 12 నెలలూ జీతం ఇవ్వాలని, పదవీ విరమణ అయిన తర్వాత మినిమం పెన్షన్ ఇవ్వాలని నినాదాలు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి కె.స్వామిదాస్, సీహెచ్ శ్రీనివాసరావు, ఎం మేరీ గ్రేస్, కె.శారారాణి, పి.రాజు, ఎండీ. బాషా, ఎం శర్మ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

ఆయుర్వేద వైద్య పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించి 92 మందికి పరీక్షలు చేశారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు ఇచ్చి, తగిన సూచనలు, సలహాలు అందించారు. ఆయుర్వేద వైద్యుడు నగేష్ బృందం ఈ పరీక్షలు చేశారు.

అంతర పంటలపై ఆసక్తి

చింతలపూడి: నియోజకవర్గంలో రైతులు అంతర పంటలపై ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. ఏటా అతివృష్టి లేదా అనావృష్టితో ఒక పంటకు నష్టం వాటిల్లినా మరో పంట ఆదుకుంటుందన్న ఆశతో ఖర్చుకు వెనుకాడకుండా అంతర పంటలను సాగు చేస్తూ నిరంతర లాభాలను సాధిస్తున్నారు. అంతేకాక పెరుగుతున్న ఎరువులు, పురుగుమందులు, సాగు పెట్టుబడులతో గిట్టుబాటు ధర లభించక మరింత ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు వాణిజ్య పంటలతో పాటు అంతర పంటలపై మొగ్గు చూపుతున్నారు. మెట్ట ప్రాంతంలో సుమారు 10 వేల ఎకరాలకు పైగానే రైతులు అంతర పంటలు సాగు చేస్తున్నట్లు అంచనా. అంతర పంటల్లో భాగంగా కొబ్బరిలో కోకో, అరటి, వక్క, ఆయిల్‌పాం తోటల్లో వేరుశనగ, మొక్కజొన్న, మామిడిలో మొక్కజొన్న సాగు, ఏకకాలంలో రెండు, మూడు రకాల కూరగాయల సాగు చేస్తున్నారు.

పాడి-పంట



ఆయిల్ పాం లో మొక్కజొన్న పంట



అరటిలో వేరుశనగ పండిస్తున్న దృశ్యం

అంతర పంటల సాగు వల్ల వాణిజ్య పంటల సాగులో పెట్టుబడులను అంతర పంటల ద్వారా రైతులు సమకూర్చుకుంటున్నారు. దీనివల్ల కూలీల కొరతను అధిగమించడమే కాకుండ ఎరువులు, పురుగు వుందులు వాడినప్పుడు ఖర్చు తగ్గుముఖం పట్టినట్లు రైతులు చెబుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలను పండించే వీలు కలుగుతుందని చెబుతున్నారు. ప్రభుత్వాలు కూడ అంతర పంటల వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రైతులకు ప్రత్యేక రాయితీలు, రుణాలు అందించి అంతర పంటల సాగు పెరగడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కొబ్బరిలో అరటి పంట

రాయితీలు ఇవ్వాలి



అంతర పంటల సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇవ్వాలి. వాణిజ్య పంటల్లో అంతర పంటలు వేసుకోవడానికి విత్తనాలు ఉచితంగా సరఫరా చేసి రైతులను ప్రోత్సహించాలి. అంతర పంటలు పండించడం వల్ల సాగు ఖర్చులు తగ్గాయి.

– కె.రామారావు, రైతు, సీతానగరం

పెట్టుబడులు పెరిగాయి



ప్రస్తుతం వ్యవసాయంలో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. కూలీలు కూడా గ్రామాల్లో దొరకడం లేదు. దీంతో ఒకేసారి రెండు రకాల పంటలు పండించకపోతే గిట్టడం లేదు. అంతర పంటల వల్ల ఖర్చులు తగ్గి ఆదాయం కూడ వస్తోంది.

– తాండ్ర రామకృష్ణారావు, సర్పంచ్, చింతంపల్లి

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	56	బీన్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	34
బెండకాయలు	26	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	44	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	50
బీరకాయలు	30	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	56-50	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనపకాయ (1)	25-30	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	11
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	05
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	06
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

దివ్యాంగుల సమస్యలపై పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

ఏలూరు (టూటౌన్): దివ్యాంగుల సమస్యలపై సమష్టిగా పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (కపర్ది భవనం) ఆఫీస్‌లో ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం సమావేశం దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుందేటి జయరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు తరగతుల ఉద్యోగ, శ్రామికులు ఏఐటీయూసీ – ప్రజా సంఘాల్లో చేశారు. కార్యక్రమంలో కృష్ణ చైతన్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ఉచిత బస్సు సౌకర్యాన్ని దివ్యాంగులకు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్లైండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు వీరభద్రరావు, అడ్వకేట్ వీర్రాజు, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి లక్కపోగు రాంబాబులు మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ఏలూరులో స్థలం కేటాయించి, భవనం నిర్మించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం ఇదే..

ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా కొత్త వీర్రాజు, కో కన్వీనర్ మేడపాటి రాఘవేందర్ రెడ్డి, ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బండి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా కుందేటి జయరాజు, కార్యదర్శిగా లక్క పోగు రాంబాబు, కోశాధికారిగా డాక్టర్ భూలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.మనోజ్ కుమారి, ఉపాధ్యక్షులుగా చిన్ని కృష్ణమూర్తి, బెంజిమెన్, సహాయ కార్యదర్శులుగా ఎ.ప్రసాద్ బాబు, కె.వెంకట సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

స్వాములకు భిక్ష

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములకు శనివారం 10వ రోజు మహాగణపతి పీఠం స్వాములు ఏడుకొండల గురుస్వామి శిష్యబృందం భిక్ష ఏర్పాటుచేశారని ఆలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి తెలిపారు. కోశాధికారి కూన పార్వతి గుంట్ల వెంకటేశ్వరరావు, కొర్లే పర కష్టారావు, తమ్మన వెంకటేశ్వరరావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు బాకీ శ్రీనివాస్ రెడ్డి, రొక్కం కృష్ణారావు పాల్గొన్నారు.

వెన్నెముక లేని మోదీ సర్కారును నిలదీయండి



మాట్లాడుతున్న సీపీఎం నేత బలరాం

ఏలూరు (టూటౌన్): వెన్నెముక లేని మోదీ సర్కార్ను నిలదీయాలని, అమెరికా ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం యువతకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో డీఎస్‌వీడీ ప్రసాద్ అధ్యక్షత ట్రంప్ సుంకాలు – దేశంలో ప్రభావం అనే అంశంపై స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడారు. పెట్టుబడి దారీ వ్యవస్థ, సామ్రాజ్యవాదం సంక్షోభం నుంచి బయటపడేందుకు చేసే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా ట్రంప్ సుంకాలను విధించడం, యుద్ధాలను ప్రోత్సహించి తమ ఆయుధాలను అమ్ముకునే పని చేస్తున్నారని వివరించారు. ట్రంప్ సుంకాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీకార సుంకాల ప్రభావంతో భారత్ వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బ తినడమే కాకుండా, ఉపాధి అవకాశాలు కోల్పోతారని, దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుందని హెచ్చరించారు. మోదీ మెతక వైఖరికి, ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా యువత పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, పి.రవికుమార్, కె.లెనిన్, పి.ఆదిశేషు, ఎం ఇస్మాక్, జె.గోపి, ఎస్ సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

ఐద్వా సభలను విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో నిర్వహించే 16వ ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి పిలుపు నిచ్చారు. స్థానిక పవర్‌పేటలోని ఐద్వా జిల్లా సంఘాల కార్యాలయం వద్ద, గన్‌బజార్ సెంటర్, గంగానమ్మ గుడిసెంటర్ వద్ద అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, శ్యామల రాణి, ఎం అరుణ కుమారిలు శనివారం పతాక ఆవిష్కరణ చేశారు. 13వ తేదీన భారీ బహిరంగ సభ ఉంటుందని వారు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలో ఆడబిడ్డ నిధి వెంటనే అమలు చేయాలని, మద్యం, డ్వాక్రా సమస్యలు మైక్రో ఫైనాన్స్ సమస్యలపై చర్చించి కర్తవ్యాలను రూపొందించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బి.రాజేశ్వరి, లలిత, లక్ష్మి, జనని, పూర్ణ, ఈశ్వరి, మమత, సుజాత, వెంకట్ లక్ష్మి, సింహాచలం పాల్గొన్నారు.

137 మందికి వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందిస్తున్న డాక్టర్ కృష్ణ

ఏలూరు (టూటౌన్): స్థానిక శ్రీకృష్ణ ఆస్పత్రిలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 137 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ డాక్టర్ బి.కృష్ణ మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి నెలా రెండో శనివారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.